ప్రజాశక్తి

ఆదివారం 4 ఆగస్టు 2024 — 5 — శ్రీ సత్యసాయి

పారదర్శకంగా నిత్యావసర వస్తువుల పంపిణీ

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

చౌక దుకాణాల ద్వారా అందించే నిత్యావసర వస్తువులను పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ, ఐసిడిఎస్, డిప్యూటీ తహశీల్దార్లు, వసతి గహం వార్డెన్‌లతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు, ఎదురవుతున్న సమస్యలపై జేసీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులను పకడ్బందీగా అందించాలన్నారు. ప్రస్తుతం 15 రోజుల వరకు ఎండియు ఆపరేటర్లు వారి పరిధిలో రేషన్ పంపిణీ చేస్తారన్నారు. కార్డుదారుల వేలిముద్రలు పడకపోతే ఐరిస్ విధానం ద్వారా రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీ చేసేముందు కార్డుదారులకు ముందుగానే తెలపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్డు దారులకు వీఆర్వో ఆమోదంతో పంపిణీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రతినెలా మొదటి శుక్రవారం గర్భిణులు, బాలింతలకు రేషన్ పంపిణీ జరుగుతుందని, ఆ సమయానికి ఎండిఇ ఆపరేటర్లు రేషన్ తీసుకెళ్లాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు నాణ్యమైన రేషన్ అందించాలన్నారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా రేషన్ పంపిణీ చేయాలని ఆ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన సరుకులు పంపిణీ

జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు కిలో 150 రూపాయలకు, సోనా మసూరి బియ్యం కిలో 47 రూపాయలకు పౌరసరఫరాల శాఖ ద్వారా అందిస్తామన్నారు. సరుకుల సరసమైన ధరలు సూచించే ఫ్లెక్సీలను జెసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వంశీకృష్ణ, పౌర సరఫరాల మేనేజర్ అశ్వర్థ నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్, బీసీ, గిరిజన సంక్షేమ అధికారి నిర్మలా జ్యోతి, మోహన్ రావు, ఐసిడిఎస్ అధికారి నాగమల్లేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.





స్కీం వర్కర్లపై 'అధికార' బెదిరింపులు అధికం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కీం వర్కర్ల తొలగింపునకు అధికార పార్టీ నేతలు రాజకీయ బెదిరింపుల పర్వానికి తెరలేపారు. ప్రతిపక్షంలో ఉండగా సామాన్యులకు అండగా ఉంటామని హామీలు గుప్పించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే వాటికి తిలోదకాలిచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, అంగన్‌వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు ఇలా స్కీరం వర్కర్లను ఏదోలా తొలగించేలా రాజకీయపరమైన ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ వేధింపుల తాళలేక ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొందరు స్కీం వర్కర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

తొలగింపు స్కీం వర్కర్లు..!

"శ్రీ సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం వీరప్పగారిపల్లిలో నాగమణి మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ గ్రామానికి చెందిన టిడిపి మద్దతుదారుడు ఆంజినేయులు అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని విధుల నుంచి తప్పుకోవలని బెదిరించాడు. ఈ బెదిరింపులు వేధింపులు తాళలేక గత నెల 26వ తేదీన నాగమణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది".

ఆత్మహత్యకు యత్నించిన అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

"అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామానికి చెందిన సుంకమ్మ గత 23 ఏళ్లుగా గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా ఉంటూ పిల్లలకు భోజనం అందిస్తోంది. ఇటీవల టిడిపి అధికారంలోకి రావడంతో భోజన ఏజెన్సీని వదిలేయాలంటూ గ్రామానికి చెందిన కొందరు టిడిపి నాయకులు ఆమెను బెదిరించారు. తాను ఎలాంటి వివాదాల్లో లేనని, తన జీవనాధారం దూరం చేయొద్దంటూ ఆమె ప్రాధేయపడింది. అయినా ఏజెన్సీని వదులుకోవాలంటూ టిడిపి నాయకులు బెదిరించారు. ఈ బెదిరింపులను తాళలేక మధ్యాహ్న భోజన ఏజెన్సీ గదిలోనే సుంకమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది".

ఆత్మహత్యకు యత్నించిన మధ్యాహ్న భోజన కార్మికురాలిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కిమ్ వర్కర్ల మెడపై కత్తి వేలాడుతూ ఉంటోంది. పాత వారిని తొలగించి తమ వారిని చేరుస్తామని ఒత్తిడి పెరుగుతుండటం పరిపాటిగా మారుతోంది. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా నడవగా, ఇప్పుడు కూడా ఇదే తరహా రాజకీయపరమైన ఒత్తిళ్లు కొన్ని చోట్ల ఉంటుండటం గమనార్హం. తన ఏజెన్సీని తొలగించేందుకు టిడిపి నాయకలు కుట్ర చేయడంతో అనంతపురం జిల్లాలో వజ్రకరూరు మండలంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు ఆత్మహత్యా యత్నంకు ప్రయత్నించింది. ఇక సత్యసాయి జిల్లాలో ఓడిసి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త ఒకరు ఆత్మహత్యాయత్నకు ప్రయత్నించింది. ఇలా పాలకులు మారిన ప్రతిసారీ జరుగుతున్న తొలగింపునకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురం, సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు.

స్కీమ్ వర్కర్లపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది వేల మందికిపైగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. మూడు వేల మంది వరకు ఆశా వర్కర్లు, వెయ్యి మంది వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరు కాకుండా మూడు వేల మంది వరకు మధ్యాహ్న భోజన కార్మికులు న్నారు. ఇవే కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులున్నారు. ఇందులో యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులున్నారు. వీరిలో అత్యధిక మందిని ఇప్పటికే తొలగింపులు చేశారు. ఇందులో నిబంధనలు కూడా పాటించలేదన్న విమర్శలున్నాయి. కనీసం నోటీసులు కూడా లేకుండానే ఏకపక్షంగా మార్పులు చేపట్టడం అనేక విమర్శలకు సైతం తావిస్తోంది.

23 ఏళ్లుగా ఏజెన్సీ నిర్వహిస్తున్న నిర్వాహకురాలి తొలగింపు

అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయపురంలో సుంకమ్మ 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిగా ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం వస్తూనే ఏజెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని స్థానిక నేతలు ఒత్తిడి చేశారు. దీంతో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది.

5న కలెక్టరేట్ వద్ద ధర్నా

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టనున్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, మున్సిపల్ కార్మికులు, యానిమేటర్స్, తదితర స్కీం వర్కర్ల వేధింపులపై ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన కొనసాగునుంది. వీరి ఆందోళనకు పలు కార్మిక, రైతు, ప్రజాసంఘాలు ఇప్పటికే మద్దతు తెలిపాయి.

సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలంలోని వీరప్పగారిపల్లిలో అంగన్‌వాడీ వర్కరు నాగమణిని విధుల నుంచి తప్పుకోవాలని కొంత మంది స్థానిక నాయకులు ఒత్తిడి చేశారు. దీంతో ఆమె నేతల ఒత్తిడితోనే తాను ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నానని వీడియోను సోషియల్ మీడియాలో పోస్టు చేసి పురుగుల మందు తాగింది. ఇలా రెండు జిల్లాల్లోనూ స్కీమ్ వర్కర్లపై నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికుల కుటుంబాలు ఒక్కసారిగా బజారునపడే పరిస్థితి నెలకొంది.

- సర్కారు మారినప్పడల్లా సంకటమే
- కొత్త ప్రభుత్వాలొచ్చిన ప్రతిసారీ స్కీమ్ వర్కర్లపై ఒత్తిడి
- తొలగింపులకు వ్యతిరేకంగా రేపు కలెక్టరేట్‌ల ఎదుట నిరసన

రాజకీయ ఒత్తిళ్లు సరికాదు

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ స్కీమ్ వర్కర్లపై రాజకీయపరమైన ఒత్తిళ్లు తీసుకొచ్చి ఉపాధి నుంచి తొలగించే కుట్రలు చేయడం సరికాదు. కార్మికులను తొలగించే ముందు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండానే తీసేసి, కొత్త వారిని నియమిస్తున్నారు. ఇది సరైంది కాదు. రాజకీయ పరమైన ఒత్తిళ్లు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

నాగమణి,
సిటియు జిల్లా అధ్యక్షురాలు, అనంతపురం.

అప్పడలా... ఇప్పడిలానా..?

స్కీం వర్కర్ల తొలగింపులు 2019లో ఇదే రకంగా జరుగుతుంటే తెలుగుదేశం నాయకులు వ్యతిరేకించారు. తొలగింపులు సరైంది కాదంటూ ప్రకటించారు. ఇప్పుడు వారు అధికారంలోకి వస్తూనే కొన్ని చోట్ల తొలగింపులు పెరిగాయి. ఇటువంటి చర్యలను ఖండిస్తూనే సిఐటియు నిరసనకు పిలుపునిచ్చింది. ప్రభుత్వం స్పందించి తొలగింపులను ఆపకపోతే ఐక్యపోరాటాలు చేపడతాం.

ఇఎస్.వెంకటేశ్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యసాయి జిల్లా.

కలెక్టర్, ఎస్పీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

కలెక్టర్, ఎస్పీ చర్యలు అభినందనీయం

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్, మడకశిర

ఈ నెల 1వ తేదీన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మడకశిర మండలం గుండుమల గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమం ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయడంలో కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ రత్నలు విశేష కృషి చేశారని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. చంద్రబాబు పర్యటను విజయవంతం చేసేందుకు కృషి చేసిన కలెక్టర్, ఎస్పీలను పుట్టపర్తిలోని వారి కార్యాలయాల్లో కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామాకోటి ఆదినారాయణ, సత్యసాయి జిల్లా యాదవ సంఘం నాయకులు రాజు యాదవ్, కిరణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, సాయి ప్రసాద్ యాదవ్, గంగప్ప యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి -హిందూపురం

మాట్లాడుతున్న ఎంఇఒ గంగప్ప

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కెజిబివి, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 'పాఠ శాల నిర్వహణ కమిటీ' ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ గంగప్ప సూచించారు. మండల వ్యాప్తంగా మొత్తం 120 పాఠశాలల్లో 8వ తేదీన ఎస్ఎంసి 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నిక చేయాల్సి ఉందన్నారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 80, ప్రాథమికోన్నత 16, ఉన్నత 21, రెసిడెన్షియల్ 3 పాఠశాలలు ఉండగా, ఎన్నికల నిర్వహణపై శనివారం పట్టణంలోని చిన్మయా పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఇఒ-1 గంగప్ప, ఎంఇఒ-2 ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి ధ్యేయం గా ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. ఈ నెల 5వ తేదీ ఎన్నికల నిర్వహణపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుసుకుని ప్రధానోపాధ్యాయులు చక్కదిద్దాలన్నారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎన్నిక జరపాలని, 3 గంటలకు మొదటి సమావేశం జరపాలని తెలిపారు. సమావేశంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఆర్పీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూరిన లారీ

నెల రోజుల క్రితం ప్రమాదం...

ఇంకా అక్కడే వాహనం..!

ప్రజాశక్తి-తనకల్లు

తనకల్లు మండల పరిధిలోని పరాకువాండ్లపల్లి జాతీయ రహదారిపై గత నెల 1వ తేదీన ఓ లారీ బీభత్సం సష్టించింది. ఎదురుగా వస్తున్న ఓ లారీని ఢీకొని మరో ఆటోను ఢీ కొట్టి నేరుగా జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మతి చెందాడు. ఆటో, ఇల్లు, పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ ప్రమాదం జరిగి నెల రోజులు దాటింది. కానీ ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ ఇప్పటికీ అక్కడే ఉంది. ఇంతవరకు దాన్ని బయటికి తీసే ఏర్పాటును సంబంధిత పోలీసులు, అధికారులు చేయలేదు. ప్రమాదం జరిగిన ఇంటి పక్కనే సెబ్ పోలీస్ స్టేషన్ ఉంది. రోడ్డుపై లారీ అడ్డంగా ఉండడంతో అక్కడికి రాకపోకలు చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లారీని అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్య సేవలు

కదిరి అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇకపై డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు 4 డయాలసిస్ యంత్రాలు రావటానికి సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కి శనివారం సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో యంత్రాలు లేక డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. ఎమ్మెల్యే సహకారంతో యంత్రాలు రావడంతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.

ర్యాగింగ్‌తో జీవితాలు బుగ్గిపాలు

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దు అని జూనియర్ సివిల్ జడ్జ్ రాజ్యలక్ష్మి తెలియజేశారు. విద్యార్థులు పట్టుదలతో విద్యాభ్యాసం సాగించి విజయం సాధించాలన్నారు. శనివారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ర్యాగింగ్ నివారణపై న్యాయ విజ్ఞాన సదస్సు ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ఏపీపీ ఇందాద్, ఎజిపి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైంది అన్నారు. మంచి నిర్ణయాలు తీసుకుని ముందుకెళితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర వాహనాలను ఉపయోగించరాదన్నారు. అమ్మాయిలు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ పై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంతోషి కుమారి, పార్వతి, నవేరా, రవిచంద్ర, గురునాథ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లోకనాథ్, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యన విద్యుత్ స్తంభాలు.. పొంచిఉన్న ప్రమాదాలు..!

ప్రజాశక్తి-హిందూపురం

కొట్నూరులో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు

నిరుపయోగంగా రోడ్డు పక్కన పడేసిన విద్యుత్ స్తంభాలు

ఉన్నాతాధికారుల పర్య వేక్షణ లోపం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇళ్ల మధ్యనే కొట్నూరులో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. గత రెండు రోజుల నుంచి చిరు జల్లులు కురుస్తున్న నేపథ్యంలో వీటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని ఒకటవ వార్డు కొట్నూరు బిసి కాలోనిలో గత కొన్ని సంవత్సరాల క్రితం ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయాలని ఎల్‌టి విద్యుత్ లైన్‌ను ఇళ్ల మధ్యన, రహదారి మధ్యలో ఏర్పాటు చేశారు. దీంతో పాటు కొన్ని ఇళ్లపైన లైన్ పోయే విధంగా లైన్‌లను లాగారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యుదాఘాతం ఎక్కడ జరుగుతుందో అని ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నివాస ప్రాంతాల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో ప్రమాదాల పొంచి ఉన్నా యని సంబంధిత అధికారులకు, పాలకులకు చెప్పిన ప్పటికీ ఏమాత్రం పట్టించు కోవడంలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్యన విద్యుత్ స్తంభాలు ఉండడంతోపాటు దాదాపు 30 ఏళ్ల పైన విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రమాదాలు జరిగే సూచనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వంలో గత కొన్ని నెలల క్రితం అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో నూతనంగా విద్యుత్ లైన్(ఎల్‌టిలైన్) ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ నూతన లైన్ ఏర్పాటు కోసం విద్యుత్ స్తంభాలు గ్రామానికి తీసుకొచ్చారు. ఈ స్తంభాలను ఏర్పాటు చేయకుండా మూలన పడేశారు. ఇప్పటి వరకు నూతనంగా ఎల్‌టి లైన్ ఏర్పాటు చేయక పోవడంతో సిమెంటు స్తంభాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి రక్షించాలని కాలవాసులు సునీతమ్మ, గంగమ్మ, నాగరత్న, నారాయణప్ప, సోములు కోరారు.

ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో డిపో ఎదుట బైఠాయించిన విద్యార్థులు

బస్సు సౌకర్యం కల్పించాలి

ఆర్టీసీ డిపో ఎదుట విద్యార్థుల బైఠాయింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

గాండ్లపెంట మండలంలోని కటారుపల్లి నుంచి పట్టణంలోని కళాశాలలకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు ఉపేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించారు. ఆర్టీసీ బస్సు గారేజ్ గేట్లను మూసివేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు సమయానికి రానందున విద్యార్థులు కళాశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందన్నారు. దాదాపు 30 మంది ఆటోల్లో ప్రయాణిం చాల్సి వస్తోందని, బస్సు పాస్ ఉన్నా ప్రయోజనం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై రెండు నెలల క్రితమే మేనేజర్, ఆర్టీసీ డిఎంకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు అనుగుణంగా కటారుపల్లి నుంచి ఆర్టీసీ బస్సు పడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరప్ప, భాస్కర్, శ్రీనివాసులు, తదితరులు మద్దతు పలికారు. అనంతరం వారు కదిరి డిపో మేనేజర్ హరితకు వినతి పత్రం అందజేశారు.

12 ఏళ్లకే వినూత్న సైకిల్ తయారీ

ప్రశంసించిన పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



ముబారక్‌ను అభినందిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

పట్టణంలోని 19వ వార్డుకు చెందిన ముబారక్(12) తన మేధా సంపత్తిని ఉపయోగించి వినూత్నమైన రీతిలో సైకిల్ తయారు చేశాడు. ఆ సైకిల్‌కు కొన్ని ప్రత్యేకతలు జోడించి తయారు చేయడం పలువురిని అబ్బురపరుస్తోంది. సైకిల్‌ను కాళ్లతో తొక్కకుండా హ్యాండిల్ ద్వారానే ముందుకు కదిలేలా అమర్చాడు. ఈ విషయం తెలిసి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆ సైకిల్‌ను పరిశీలించి ముబారక్‌ను అభినందించాడు. సైకిల్ తయారీకి అవసరమయ్యే పరికరాలకు శ్రీరామ్ బాలుడికి ఆర్థికసాయం అందజేశారు. ముబారక్ చేసే సరికొత్త ప్రయోగాలకు సహాయ సహకారాలు అందిస్తామని శ్రీరామ్ భరోసా ఇచ్చారు. అనంతరం గాంధీనగర్‌లో ముబారక్‌ను ఘనంగా సన్మానించారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొక్కలను విరివిగా పెంచాలి : ఎంఇఒ

పెనుకొండ : ఆహ్లాదకరమైన, స్వచ్ఛమైన వాతావరణం కోసం మొక్కలను విరివిగా పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంఇఒ సుధాకర్ పిలుపుని చ్చారు. జాన విజ్ఞాన వేదిక (పర్యావరణ సబ్ కమిటీ) ఆధ్వర్యంలో శనివారం తిమ్మాపురం ఎంపిపి స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంఇఒ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో చెట్లు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. మొక్కలను నాటి సంక్షరించే కార్యక్రమా ల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి హరి, హెచ్‌ఎం రమేష్, టీచర్ పి.లక్ష్మీబాయ్, జెవివి కార్యకర్త నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శనానికి ప్రత్యేక బస్సులు

ధర్మవరం టౌన్ : శ్రావణ మాసం సందర్భంగా హనుమాన్ దర్శనానికి ఈ నెల 6వ తేదీ నుంచి ధర్మవరం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపు తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో ధర్మవరం డిపో నుంచి మురడి, నేమకల్లు, కసాపురం ఆలయాల్లో ఆంజనేయస్వామిని దర్శనార్థం బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ఛార్జీ పెద్దలకు రూ. 580, పిల్లలకు రూ. 300. బుకింగ్ కోసం 63031 51302 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికుల తొలగింపు తగదు

కొత్తచెరువు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను తొలగించడం తగదని సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, నాయకులు అంజి తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక బిసి కాలనీ లో ఉన్న లేబర్ ఆఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మూడేళ్లుగా చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీలో తాత్కాలిక ఉద్యోగులుగా ఆరుగురు మహిళలు పని చేస్తున్నారన్నారు. కూటమి ప్రభు త్వం ఏర్పడిన తర్వాత వీరిని తొలగించి వారికి అనుకూలమైన వారిని నియమించుకున్నారన్నారు. ఉన్నఫళంగా వారిని విధుల నుంచి తొలగించడం తగదని, 4 నెలల నుంచి వారికి జీతాలు కూడా ఇవ్వలే దన్నారు. ఇలాగే పలు శాఖల్లో తాత్కాలిక ఉద్యోగులను తొలగిస్తున్నారని, ఇలాంటి సంఘటనలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకర్‌రెడ్డి, శ్రావణి, తాత్కాలిక ఉద్యోగులు ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి, తాకమ్మ, పెద్దక్క, పార్వతి, సరోజమ్మ పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు మృతుని ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆర్థికసాయం చేసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రెసిడెంట్ ముక్తం ఈశ్వరయ్య, సభ్యులు లింగన్న, ముక్తం మణిదీప్, సంకు సుధాకర్, మాబువలి, గోవిందు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

యుటిఎఫ్‌లో చేరిన ఉపాధ్యాయులు

యుటిఎఫ్‌లో ఉపాధ్యాయులు చేరిక

కదిరి టౌన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు వైవి.సుబ్బారెడ్డి, మల్లికార్జున ఆధ్వ ర్యంలో పలువురు ఉపాధ్యాయులు యుటిఎఫ్‌లో చేరారు. పట్టణం లోని ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో శనివారం తనకల్లు మండల యుటిఎఫ్ నాయకులు సంతోష్ ఆధ్వ ర్యంలో ఉపాధ్యాయులు గణేష్, శివరామకృష్ణ, షరీఫ్, శ్రీనివాసులు, బాలకృష్ణా రెడ్డి, శ్రీరాములు నాయక్ యుటిఎఫ్‌లో చేరారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యా యులు, ఉద్యోగుల సమస్యలపై గళం ఎత్తుతున్న ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. హక్కులు, బాధ్యతలతో పాటు సామాజిక స్పృహ కలిగిన సంఘం యుటిఎఫ్ అన్నారు. ఉపాధ్యాయులు, విద్యా వ్యవస్థ వృద్ధికి కట్టుబడుతూనే అనేక సామాజిక కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. యుటిఎఫ్ బలోపేతానికి, ఉపాధ్యాయులు, విద్యా రంగంలో నెలకొన్న సమస్యల సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

ఎన్నికల హామీలు అమలుచేయాలి

పుట్టపర్తి అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాం డ్ చేశారు. స్థానిక సాయి ఆరామంలో శనివారం పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రామచంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హిందుత్వం, యుద్ధ బూచి తో గద్దెనెక్కిందని విమర్శించారు. బిజెపి గత మూడు ఎన్నికల సమ యంలో కూడా ఎన్నో హామీలు ఇచ్చి వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కార్పొ రేట్లకు కొమ్ముకాస్తూ వారికి వేల కోట్లు రాయితీలు కల్పిస్తుందని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇక రాష్ట్రంలో మూడు పార్టీలు(కూటమి) ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం వామపక్షాలు పనిచేస్తూనే ఉంటాయన్నారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, అంగన్వాడీ వర్కర్ల యూనియన్ కార్యదర్శి నాగమణి, విద్యార్థి సంఘాల నాయకుడు పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులకు గుడ్లగూబ అప్పగింత

రొద్దం : మండలంలోని చిన్నగులపల్లి మలుపు వద్ద రైతు శ్రీనివాస్‌రెడ్డి పొలంలో ఓ గుడ్లగూబ అనారోగ్యంతో అచేతనంగా పడి ఉంది. దానిని రైతు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అటవీ సిబ్బంది శిరీష్, భాస్కర్, నరేంద్ర అక్కడికి చేరుకుని గుడ్లగూబను పెనుకొండ పశు వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు.

కూలిన విద్యుత్ స్తంభం.. తప్పిన పెను ప్రమాదం

హిందూపురం : నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉన్నఫళంగా ఓ విద్యుత్ స్తంభం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయంపై మున్సిపల్ అధికారుల ను సంప్రదించగా విద్యుత్ స్తంభం తుప్పు పట్టడం వల్ల పడిపోయిందన్నారు. కాగా పట్టణంలో ఇలాంటి స్తంభాలు చాలా వరకూ ఉన్నాయని పెనుప్రమాదం జరగక ముందే మున్సిపల్ అధికారులు నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అంబేద్కర్ సర్కిల్ పడిపోయి వీధి దీపాల విద్యుత్ స్థంబం

పాలకుల నిర్లక్ష్యం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒకవైపు ప్రకృతి కోపం... మరోవైపు పాలకుల నిర్లక్ష్యం వెరసి అనంతపురం జిల్లా వాసులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా పక్కనున్న కర్నాటక, కేరళ రాష్ట్రాలనూ వర్షాలు ముంచేతుత్తుంటే అనంతపురం జిల్లాలో మాత్రం చినుకు నేల రాలడం లేదు. ఖరీఫ్ సాగుకు కీలకమైన జులై నెలలో 64 శాతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వేరుశనగ పంట సాగు జరగలేదు. ఒక్క అనంతపురం జిల్లాలోనే ఐదున్నర లక్షల ఎకరాల వరకు పంట పొలాలు బీడుగానున్నాయి. సత్యసాయి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల వరకు ఇదే పరిస్థితి ఉంది. ఇంత పెద్దఎత్తున పంటలు సాగవకుండా ఉంది. ఆగస్టులో పడుతున్నా అరకొర వర్షాలుగానే నమోవుతూ ఉన్నాయి. ఈనేపథ్యంలో అధికారులు ఆగస్టులో వర్షాలు పడితే కనీసం ప్రత్యామ్నాయ పంటల సాగుకైనా అవకాశముంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం వైపు నుంచి ప్రత్యామ్నాయం పంటల వైపు ఆలోచన కూడా కనిపించడం లేదు. ఇదిలా ఉంటే పాలకుల శాపంతో సాగునీరు కూడా రావడం లేదు. ఒకవైపు తుంగభద్ర డ్యామ్, మరోవైపు శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండి గేట్లు కూడా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పోతున్న నీళ్లను అత్యధికంగా వర్షాలు పడని అనంతపురం జిల్లాకు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఎందుకంటే తుంగభద్ర డ్యామ్ ద్వారా నీరు తెచ్చుకోవాలంటే నీరొచ్చే ప్రధాన ఎగువ పరిస్థితి దయనీయంగా ఉంది. ఎక్కడ గండ్లు పడతాయోనని కొద్ది కొద్దిగా నీటిని డ్రా చేసుకోవాల్సి వస్తోంది. కనీస మరమ్మతులు కూడా లేకుండా ఉండటంతో నీటిని పూర్తి స్థాయిలో తీసుకోలేకపోతున్నారు. ఇక శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా నీరు తీసుకునే అవకాశముంది. కర్నూలు జిల్లాలో హైవే పనుల కోసమని కాలువను పూడ్చటంతో నీటిని తీసుకోలేకపోతు న్నారు. ఆ నీటిని తీసుకోగలిగితే జిల్లాలో చాలా వరకు సాగు, తాగునీటి కష్టాలు తొలగే అవకాశముండింది. ఇలా పాలకుల శాపంతో జిల్లావాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇంకోవైపు గతేడాది ఖరీఫ్ పంట నష్టానికి సంబంధించి రావాల్సిన పంటలబీమా కూడా మంజూరవలేదు. ఎప్పటికిస్తారో కూడా తెలియదు. ఈ సంవత్సరం బీమా పరిస్థితి ఏమిటో కూడా తెలియటం లేదు. ఇప్పటి వరకు పంటలబీమా విధనంపై స్పష్టత లేదు. ఈ విధంగా అటు ప్రకృతి, ఇటు పాలకుల విధానాలు జిల్లా రైతాంగానికి శాపంగా మారాయి. ఈవారంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మడకశిర మండలం లోని గుండుమలలో పర్యటించారు. నేరుగా గ్రామస్థులతో మాట్లాడారు. అప్పుడు వక్క, పట్టు రైతుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటి పట్ల సానుకూలంగా ఆయన స్పందించారు. వక్క రైతుల సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. ఇదే సమయంలో హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఈ వారంలో మండల స్థాయి అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. తహశీల్దార్లు, సిఐల బదిలీలు పూర్తయ్యాయి. మొత్తం జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు అందరి బదిలీలు పూర్తయ్యాయి.

5న కలెక్టరేట్ వద్ద స్కీం వర్కర్ల ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, మున్సిపల్ కార్మికులు, యానిమేటర్స్, తదితర స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సర్కిల్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 నెలలు దాటకనే జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాలోల పనిచేస్తున్న చిరుద్యోగులను రాజకీయంగా వేధించడం, అక్రమంగా తొలగించడం తగదన్నారు. టిడిపి నాయకుడి వేధింపులు భరించలేక మండలంలోని వీరప్పగారిపల్లి అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డిందన్నారు. చిరుద్యోగులపై వేధింపులు ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంగమ్మ, ఆశీర్వాదమ్మ, సిఐటియు నాయకులు శ్రీరాములు, కుళ్లాయప్ప, శ్రీనివాసులు, శ్రీకాంత్, నాగరాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

ధర్మవరం టౌన్ : ఈ నెల 5వ తేదీ కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయలని సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, సిపిఎం సీనియర్ నాయకులు ఎన్‌హెచ్ బాషా పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ, ఐకెపి, ఫీల్డ్‌అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం, మున్సిపల్ ఇంజినీరింగ్ రంగాల కార్మికులను అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నార న్నారు. వీటిని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్, అంగన్వాడీ ప్రాజెక్టు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరంలో విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాజకీయ వేధింపులు ఆపాలి

పుట్టపర్తి క్రైమ్ : చిరుద్యోగులు, స్కీం వర్కర్లు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు మండల కన్వీనర్లు పైపల్లి గంగా ధర్, పెదపల్లి బాబా డిమాండ్ చేశారు. వారు పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ నాయకుల అనుచరులను ఉద్యోగాల్లో చేర్పించడం కోసం అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తారని ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోపే ప్రజలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడడం తగదన్నారు. ఇకనైనా వేధింపులు ఆపకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈ నెల 5వ తేదీ కలెక్టరేట్ వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి రూ. 50వేలు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి శనివారం దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరిగి వేణుగోపాలరావు రూ. 50వేల చెక్కును ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, ప్రశాంత్‌కుమార్‌కు అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ మరమ్మతుల కోసం వేణుగోపాలరావు సాయమందించడం సంతోషంగా ఉందన్నారు. మరి కొందరు దాతలు సహకారం అందిస్తే ప్రెస్ క్లబ్‌ను మరింత అభివృద్ధి చేస్తామ న్నారు. అనంతరం దాత వేణుగోపాల్‌రావును ప్రెస్ క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ప్రకాష్, ప్రధాన సలహాదారు సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అల్లిపీరా, రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, పాత్రికేయులు పాల్గొన్నారు.

కమిటీ అధ్యక్ష, కార్యదర్శులకు చెక్కు అందిస్తున్న వేణుగోపాలరావు

పాత్రికేయులకు పోస్టల్ ఇన్సూరెన్స్

పరిగి : స్థానిక దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు పాత్రికేయులకు పోస్టల్ ప్రమాద బీమా చేయించారు. ఆయన మండలంలోని 13మంది పాత్రికేయు లకు రూ. 950 చొప్పున ప్రీమియం చెల్లించారు. వేణుగోపాలరావు శనివారం తన కార్యాలయంలో మండలంలోని జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి హిందూపురం డిఒపిఎల్‌ఐ నరసింహమూర్తి సహకారంతో ఇన్సూరెన్స్ చేయించారు. అనంతరం పాత్రికేయులు వేణుగోపాలరావును సన్మానిం చారు. కార్యక్రమంలో దివ్య, సురేఖ, సుచిత, ఊటకూరు, శీరేకోలం, పరిగి పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించండి : ఎస్ఐ

బత్తలపల్లి : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్ఐ సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ముఖ్య పట్టణాలకు ప్రధాన కూడలి బత్తలపల్లి అని, ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా తోపుడుబండ్లు, వ్యాపారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలన్నారు. వారు చెప్పే సమస్యలను సావధానంగా విని వారికి భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో ఎఎస్ఐలు సోమశేఖరమూర్తి, తిరుపాలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో సమావేశమైన ఎస్ఐ శ్రీనివాసులు

రోడ్డుపైనే డ్రెయినేజీ వ్యర్థాలు

కదిరి టౌన్ : పట్టణంలోని కాలేజ్ సర్కిల్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకూ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలవల్లో గత ఆదివారం మున్సిపల్ అధికారులు పూడిక తీత పనులు చేపట్టారు. కాలువలోని వ్యర్థాలను రోడ్డుపై వేసిన మున్సిపల్ అధికారులు అక్కడి నుంచి వాటిని తొలగించలేదు. దీంతో జాతీయ రహదారిపై సగం వరకూ వ్యర్థాలు, పూడిక అడ్డుగా వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు ఆ మార్గంలో నడవాలన్న ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు రోడ్డుపై ఉన్న వ్యర్థాలు, పూడికను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.


జాతీయ రహదారి పై అడ్డంగా వేసిన పూడిక

కూరగాయల నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

నల్లమాడ : కూరగాయల నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి అని, నిర్వాహకులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం పలు నర్సరీలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల కూరగాయలు, పండ్లతోటల నర్సరీలను పరిశీలించామని, ఒక్క నర్సరీకి కూడా లైసెన్స్ లేవని మండిపడ్డారు. లైసెన్స్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు లోకేష్, వినోద్, షానవాజ్, శిరీష్, స్వరూప, తదితర అధికారులు పాల్గొన్నారు.


తోటలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

వక్కతోటల పరిశీలన

అమరాపురం : మండలానికి వక్క మార్కెటింగ్ సౌకర్యం, ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి స్థల పరిశీలన కోసం శనివారం వచ్చిన పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌ను మడకశిర వక్క, సుగంధ ద్రవ్యాల కంపెనీ ఛైర్మన్ ఉగ్ర నరసింహ, డైరెక్టర్ ప్రకాష్ శాలువా, పూలమాలతో సన్మానించారు. వారు ఈ ప్రాంతంలోని వక్క, తమలపాకు రైతుల వివరాలతో పాటు మార్కెట్ సౌకర్యం లేక రైతులు పడుతున్న ఇబ్బందులను సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సబ్ కలెక్టర్ రైతులతో కలిసి వక్క తోటలను పరిశీలించారు.

దారిచూపాలని తహశీల్దార్‌కు వినతి

నల్లమాడ : మండలంలోని పెమలకుంటపల్లి గ్రామ సమీపంలో హైవే రోడ్డు పనులు జరుగుతు న్నాయి. ఈ రోడ్డుకు అటువైపు సుమారు వంద ఎకరాల్లో పంట పొలాలు ఉన్నాయి. హైవే రోడ్డు పనుల వల్ల ఆయా పొలాల్లోకి వచ్చి పోయేందుకు దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. దీంతో గ్రామం నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు దారి చూపాలని కోరుతూ గ్రామస్తులు శనివారం సిపిఎం మండల నేత గోవిందు ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రి ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో పిప్పన్న, గంగులప్ప, ఎస్. చంద్రాయుడు, కె.లక్ష్మీనారాయణ, రామాంజి, మధు, గంగులప్ప పాల్గొన్నారు.

'తల్లిపాలకు మరేవీ సాటిరావు'

పుట్టపర్తి రూరల్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, మరే పాలు సాటిరావని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఎనుములపల్లి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు తల్లి పాల విశిష్టతను తెలిపారు. పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి పాలు తాగించాలని, మొదటి 6 నెలలు తల్లి పాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని, తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార, తదితర ప్రమాదకర వ్యాధుల నుంచి కాపాడతాయన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వివరిం చారు. కార్యక్రమం లో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఆరోగ్య కార్యకర్తలు పరిమళ, సుహాసిని, అంగన్వాడీ టీచర్ శైలజ, ఆశా కార్యకర్తలు రాధమ్మ, అమృత పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

నేరాలు ఘోరాలు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు కారణాలతో శనివారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ధర్మవరం పట్టణంలో కుటుంబ సమస్యల నేపథ్యంలో దాదాఖలందర్(35) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన ఆర్టీసీ గ్యారేజీలో హెల్పర్‌గా పనిచేస్తున్న ఎం.రామచంద్ర(52) రైలు కింద పడి తనువు చాలించాడు. లేపాక్షి మండలంలోని కల్లూరు గ్రామంలో భర్తతో గొడవ పడిన ప్రమీలమ్మ(28) మనస్థాపానికి గురై నిద్రమాత్రలు మింగి బలవన్మరణానికి పాల్పడింది. ఆయా సంఘటనల వివరాలు ఇలా ఉన్నాయి..

ధర్మవరం పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన దాదా ఖలందర్(35) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 1వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. దాదా ఖలందర్ శుభ కార్యాలయాల కు డెకరేషన్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కుటుంబ సమస్యల నేపథ్యంలో దాదా ఖలందర్, భార్య నజియా వాదులాడుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన దాదా ఖలందర్ అర్ధరాత్రి ఇంట్లోనే ఓ గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసు పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలి పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపాఉ. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఇర్షాద్ అన్న దాదా ఖలందర్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు నాగూర్‌హుస్సేన్ ఉన్నారు.

ఆత్మహత్యచేసుకున్న దాదా ఖలందర్

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆర్టీసీ కార్మికుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన ఎం. రామచంద్ర(52) పుట్టపర్తి డిపోలో గతంలో డ్రైవర్‌గా పని చేసే వాడు. కొద్దికాలంగా గ్యారేజీలో హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ గొట్లూరు నుంచి పుట్టపర్తి డిపోలో విధులకు హాజరయ్యేవాడు. శనివారం విధులకు హాజరు కాకుం డా పుట్టపర్తి రైల్వే స్టేషన్ చేరుకొని రైలు కిందపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లేపాక్షి : మండలంలోని కల్లూరు గ్రామంలో ప్రమీలమ్మ(28) నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ప్రమీలమ్మ, చిన్నప్పయ్య దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. చిన్నప్పయ్య ఆటో నడుపుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. దంపతులు శుక్రవారం చిన్నపాటి గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన ప్రమీలమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్ర మాత్రలు మింగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన ఇరుగుపొరుగు వారు హుటాహుటిన హిందూపురంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకొన్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ షర్ఫుద్దీన్ తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

లేపాక్షి : మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన నరసమ్మ(68) కంచిసముద్రం నుంచి లేపాక్షికి వెళ్లే ప్రధాన రహదారిలో బావిలో పడి మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రెండు రోజుల క్రితం నరసమ్మ కొడుకు, కోడలు చిన్న గొడవ పడ్డారు. దీంతో కొడుకు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోవడంతో అతడిని వెతుకుతూ వెళ్లి ఆమె బావిలో పడింది. విషయం తెలుసుకొన్న రెవెన్యూ, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో టిడిపి సీనియర్ నేత..

మడకశిర రూరల్ : మండలంలోని సుంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు శంకరనారాయణరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో బెంగళూరులో మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం స్వగ్రామం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి, వైసిపి నాయకులు శనివారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ మంత్రి హెచ్‌బి.నరసేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ప్రకాష్, నాయకులు అశ్వత్థమప్ప, ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

అనంతసాగరంలో పట్టపగలే చోరీ

బత్తలపల్లి : మండలంలోని అనంతసాగరం గ్రామంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కొండమ్మ కూలి పనులు చేసుకుని జీవనం సాగిసోంది. రోజూ తరహాలోనే శనివారం ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కొండమ్మ పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి చూడగా బీరువాలో ఉంచిన సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు, జత కమ్మలు, వెండి గొలుసులు, రూ. 50 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

15 మంది అరెస్ట్, రూ. 17.10 లక్షల నగదు స్వాధీనం

పెనుకొండ : మండలంలోని శెట్టిపల్లి ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి 15 మందిని అరెస్టు చేసి నగదు, కార్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ బాబిజాన్ సైదా తెలిపిన వివరాలు.. బెంగళూరు, కడప, కర్నూలు, తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. పెనుకొండ సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 15 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 17.10 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్లు, 5 కార్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారన్నారు. పుట్టపర్తి పట్టణానికి చెందిన రవి ఈ పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందని, దాడుల్లో ఆ వ్యక్తి పరారయ్యాడని ఆయన తెలిపారు. దాడుల్లో పెనుకొండ ఎస్ఐ రాజేష్, కియా స్టేషన్ ఎస్ఐ రంగడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాబిజాన్‌సైదా

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

మడకశిర : గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సర్పంచి నాగరాజు తెలిపారు. ఆయన శనివారం కల్లుమర్రి పంచాయతీ పరిధిలో రేషన్ షాపులను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.